andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 : కనిష్టం 25.8
నిర్మల్ జిల్లా వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024







ప్రసాదాల తయారీకి వినియోగించే ముడి సరుకులు



బాసర అమ్మవారి లడ్డూ ప్రసాద తయారీ కేంద్రం



బాసర ఆలయం వద్ద లడ్డూ విక్రయ కేంద్రం

లడ్డు చుట్టూ.. అక్రమాలు!



బాసర సరస్వతీ అమ్మవారి లడ్డు ప్రసాదం



బాసర సరస్వతీ అమ్మవారి అభిషేక లడ్డు

- బాసర అమ్మవారి ప్రసాద సరుకుల కొనుగోలు, లడ్డు విక్రయాల్లో గోల్‌మాల్
- కొందరు ఉద్యోగుల చేతివాటం
- అన్నిట్లో రాజకీయ నాయకుల పెత్తనం
- హైదరాబాద్ దాక చక్రం తిప్పుతున్న అక్రమార్కులు
- అవినీతి వెలుగుచూసినా.. చర్యలు చేపట్టని దేవాదాయ శాఖ

బాసర, సెప్టెంబరు, 22: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర సరస్వతీ అమ్మవారి లడ్డూ ప్రసాదం చుట్టూ అక్రమాలు చుట్టుముట్టాయి. సరుకుల ధరలు, నాణ్యతతో పాటు లడ్డూ ప్రసాదాల విక్రయాల వరకు.. ఇలా లడ్డూ తయారీ నుంచి భక్తుడు కొనుగోలు చేసే వరకు ప్రతీరోజు అవక తవకలు జరుగుతున్నాయి. కంచే చేను మేసింది అన్న చందంగా కీలక వ్యక్తులే పవిత్రమైన ప్రసాదానికి అవినీతి మరకలు అంటిస్తున్నారు. ఆపద మొక్కుల వాడు వెంకన్న లడ్డూ ప్రసాదంలో ఇటీవల కల్తీ వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాసర అమ్మవారి ప్రసాదాల నాణ్యతలోనూ పరిస్థితి కూడా అందో ళనకరంగా ఉందంటున్నారు. సరుకుల కొనుగోళ్ల నుంచి ఆ విభాగంలో విధుల కేటాయింపు వరకు రాజకీయ నాయకుల ఒత్తిళ్ల పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలు వెలుగుచూసినా రాజకీయ అండదండలతో తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. లడ్డూ పరిమాణంతో పాటు నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఫలి తంగా లడ్డూ ప్రసాదంలో ఖాజు, కిస్‌మిస్ వంటివి వెతుక్కున్నట్లు.. ఆలయం ప్రసాద విభాగంలో పారదర్శకతను భూతద్దంతో వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేట్ వారి వైపే మొగ్గు

ప్రస్తుతం దేవస్థానం ప్రసాదాల తయారీకి అన్ని సరుకులను ప్రైవేటు వ్యాపారస్తుల నుంచి కొనుగోలు చేస్తోంది. ప్రసాదాల తయారీలో ప్రధానమైన నెయ్యి కిలో రూ.620 చొప్పున కరీంనగర్‌కు చెందిన ఒక ప్రైవేటు డెయిరీ నుంచి తీసుకుంటుంది. గత మూడు రోజుల నుంచి ప్రభుత్వ సంస్థ, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గల విజయ డెయిరీ నుంచి నెయ్యిని కొనుగోలు చేస్తోంది. అంతేకాకుండా వంట నూనెలు కూడా గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ రంగ సంస్థ విజయ ఆయిల్ కాదని.. ప్రైవేటు కంపెనీల బ్రాండ్‌లను వినియోగిస్తోంది. ఇలా ప్రభుత్వ రంగ ఉత్పత్తులను కాదని ప్రైవేటు సంస్థల వాటిని వినియోగించడంపై నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందంటున్నారు.

తనిఖీల జాడేది?!

లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న ముడి సరుకుల నాణ్యత పరీక్ష లు ఇప్పటి వరకు జరిపిన దాఖలాల్లేవు. అసలు జరిపించా లన్న ఆలోచన కూడా దేవస్థానానికి పట్టలేదు. సరుకుల కొనుగోళ్ల విషయంలోనే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవాదాయ శాఖ అధికారులు.. ఇక నాణ్యతా పరీక్షలు జరిపిస్తారు అనుకోవడం అత్యాశే అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం వేలాది మందికి ప్రసాదాలను అందజేస్తున్న దేవస్థానం సరుకుల విషయంలో తూనికలు, కొలతల శాఖ అధి కారులు దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడో ఒక సారి చేపట్టిన అవి అంతా పకడ్బందీగా ఉండడం లేదు. మొక్కుబడిగా జరగ డంతో లోపాలు గుర్తించిన సందర్భాల్లేవు. తరచుగా తనిఖీలు చేపడితే ఆలయం లో భక్తుల ప్రసాదాల నాణ్యత పెరిగే అవకాశం ఉంది.

రాజకీయ పెత్తనం

అమ్మవారి ప్రసాదాల విభాగంలో రాజకీయ పెత్తనం గత పదేళ్ల నుంచి ఎక్కువైంది. సరుకుల కొనుగోలు విషయంలో ఆలయ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పని చేస్తున్నాయి. ఫలితంగా రాజకీయ నాయకులతో కుమ్మక్కై వ్యాపారులు అధిక ధరలకు సరుకులను దేవస్థానానికి అమ్ముతున్నారు. ఇలా రూపాయల కోట్ల అమ్మవారి సొమ్ము దుర్వినియోగం అవుతుంది. నాసిరకం సరుకులు పంపిణీ చేస్తున్న సదరు వ్యాపారులపై చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. గత ప్రభుత్వ హయంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే నిర్మల్ నుంచి ఫోన్‌లు వచ్చేవని ఆలయ వర్గాల్లో చర్చ ఉండేది. ఇక ఈ విభాగంలో విధుల కేటాయింపు కూడా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుంది. అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ లడ్డు పరిమాణం, విక్రయాల్లో అవకతవకలు జరుగుతున్నాయి. కాగా, రెండు నెలల కిందట స్థానికులు లడ్డూ విక్రయాల్లో అక్రమాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం గమనార్హం.



ప్రసాద విక్రయాల్లో అక్రమాలను గుర్తించి వివరాలను ఆలయ ఈఓకు అప్పగిస్తున్న గ్రామస్థులు (ఫైల్)

అక్రమాలు వెలుగుచూసినా.. చర్యల్లేవు!!

- ఈ ఏడాది మార్చి నెలలో బాసర లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే ముడి సరుకుల కొనుగోలులో జరుగుతున్న భారీ అక్రమాల విషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది.
- మార్కెట్ రేటు కంటే అధిక ధరలు చెల్లిస్తున్న విషయాలను, అధిక ధరలకు నాణ్యతలేని సరుకులను సరఫరా అవుతుండడం వంటి అక్రమాలను బయట పడ్డాయి.
- ప్రసాద విక్రయాలలో జరుగుతున్న అక్రమాలను ఆధారాలతో నిరూపించడం జరిగింది.
- అనంతరం దేవాదాయ శాఖ చేపట్టిన విజిలెన్స్ విచారణలో 'ఆంధ్రజ్యోతి' చెప్పిన విషయాలన్నీ నిర్దారణ జరిగింది. ఆ తర్వాత చార్జ్ మెమోలిచ్చి చేతులు దులుపుకున్నారు.
- దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి కిందిస్థాయి అవినీతి అధికారులకు పుష్కలంగా అండదండలున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

వారం రోజుల నుంచి ప్రభుత్వ విజయ నెయ్యినే వాడుతున్నాం

: విజయ రామరావు, బాసర ఆలయ ఈవో

లడ్డూ ప్రసాదాల తయారీ కోసం ఇప్పటి వరకు కరీంనగర్‌కు చెందిన ఒక ప్రైవేటు డెయిరీ గీ వాడేవాళ్లం. కిలో రూపాయలు 621 చొప్పున కొనుగోలు చేశాం. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గత మూడు, నాలుగు రోజుల నుండి గవర్నమెంట్ సంస్థ విజయ డెయిరీకి సంబంధించిన నెయ్యిని తీసుకుంటున్నాం. గతం కంటే తక్కువ రేటుకే కిలో 609 రూపాయలకే లభిస్తుంది. నాణ్యత పరంగా కూడా బాగుంది.

డెంగ్యూ కాదు.. వైరల్ జ్వరాలు

- ఆందోళన వద్దు
- జిల్లా వైద్యాధికారి రాజేందర్

నిర్మల్, సెప్టెంబరు 22 : జిల్లాలో ఇటీవల జరిగిన వాతావరణ మార్పువల్ల వైరల్ జ్వరాలు వస్తున్నాయని, అవి డెంగ్యూజ్వరాలు కావని జిల్లా వైద్యాధికారి రాజేం దర్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇటీవల భైంసాలో ప్రీతి అనే విద్యార్థిని ఇతర అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు సరైన పరీక్షలు జరుపకుండా డెం గ్యూ వ్యాధిగా నిర్ధారించవద్దని సూచించారు. డెంగ్యూ నిర్ధారణకు నిర్మల్‌లోని తెలం గాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిర్మల్, సెప్టెంబరు 22 : నిర్మల్ జిల్లాకు చెందిన 1974 టెన్త్, ఇంటర్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఆటపా టల తో తమ పూర్వ జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. డాక్టర్ అప్పాల చక్రధారి, న్యాయ వాది మల్లారెడ్డి, ముత్యం ఓం ప్రకాష్ గుప్తా, వనజ, స్వర్ణ, హరికిషన్, శైలజ, తదిత రులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

●లక్ష్మణచందలో...

లక్ష్మణచాంద, సెప్టెంబరు 22 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 సంవత్సర విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఊరంతా ర్యాలీగా తిరిగి సభ వేదికకు చేరుకొని, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం గత స్మృతులు, అనుభవాలను గురువులు, విద్యార్థులు పం చుకున్నారు. తమ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని గురువులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 22 : మండలంలోని బామ్ని(బీ) గ్రామానికి చెందిన భార్యభర్తలు ముదోల చిన్న ముత్యం, ముదోల లక్ష్మికి ఏడు సంవత్సరాల క్రితం కడ్తాల్ బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. భర్తకి రెండు కాళ్లు విరగగా, భార్యకి ఒక కాలు తీసేశారు. విషయం తెలుసుకున్న సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ఆదివారం వీరి ఇంటికి వచ్చి రూ.20 వేల చెక్కును జీవనోపాధి (కిరాణా షాపు) కోసం అందించి వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్ రావు, క్రాంతి (పీఆర్‌వో), మాజీ సర్పంచ్, దేవేందర్, రవి, ప్రభాకర్, ముత్యం, లక్ష్మణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేట్ బస్సు డ్రైవర్ల సమ్మె



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నిర్మల్, సెప్టెంబరు 22 : యాజమా న్యాలతో చర్చలు విఫలమైనందున సోమవారం నుండి నిర్మల్ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. డ్రైవర్ల సంఘం, ఏఐ టీయూసీ నాయకులు ఆదివారం యాజమా న్యంతో చర్చలు జరిపారు. వేతన అగ్రిమెంట్ గత నెలతో ముగిసినందున కొత్త వేతనాలకు వారు డిమాండ్ చేశారు. నెలసరి వేతనం చెల్లింపు ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు 22,500, పల్లె వెలుగు బస్సులకు 21,500ల రూపాయల చెల్లింపు తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయ కులు ఎస్ఎన్ రెడ్డి, ఎస్. విలాస్, శ్రీనివాస చారి, ఎండీ ఫయాజ్, మసీర్, సతీష్ పాల్గొన్నారు.

ఖోఖోలో ప్రతిభ చాటిన విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న యాజమాన్యం

నిర్మల్, సెప్టెంబరు 22 : నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్లూస్టార్ హైస్కూల్ విద్యార్థిని ఉమేనా రహమాన్ ఖోఖో పోటీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జట్టులో ఆడి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సయ్యద్ ముజీజ్, పీఈటీ శంషోద్దీన్ పాఠశాలలో ఆదివారం అభినందించారు. శ్రీధర్‌రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోమీటర్ల రన్నింగ్‌ను పూర్తిచేసిన సోన్ ఎస్సై

సోన్, సెప్టెంబరు 22 : కరీంనగర్ సైక్లిస్ట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన 21 కిలో మీటర్ల రన్నింగ్‌లో సోన్ ఎస్సై గోపి పాల్గొన్నారు. రన్నింగ్‌ను ఎస్సై దిగ్విజయంగా పూర్తిచేశారు. ప్రతిఒక్కరూ తప్పకుండా వ్యాయా మం చేస్తూ, క్రీడల్లో పాల్గొంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. యువత తప్పకుండా ఇలాంటి వాటిలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని సోన్ ఎస్సై కోరారు.



సోన్ ఎస్సై కే. గోపి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



మంజూరు పత్రాన్ని అందుకుంటున్న నాయకులు

కుంటాల, సెప్టెంబరు, 22 : మండల కేంద్రం కుంటాల అంబకంటి రోడ్డునుంచి గజ్జల మ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. అంతేగాకుండా ఆలయ ప్రాం గణంలో రీడింగ్ రూమ్ నిర్మా ణం కోసం రూ.5 లక్షలు మం జూరుకాగా ఇందుకు సంబం ధించిన పత్రాలను ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీసర్పంచ్ జుట్టు మహేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మణ్, తదితరులున్నారు. ఈ సందర్భంగా కుం టాల మండల తరఫున ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావుపటేల్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

లోకమాన్య సహకార సంఘం డైరెక్టర్‌గా మదన్మోహన్

నిర్మల్, సెప్టెంబరు 22 : లోకమాన్య సహకార సంఘం ప్రథమ వార్షిక సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సం దర్భంగా సంఘ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా లోకమాన్య సహకార సంఘం డైరెక్టర్‌గా నాళం మదన్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

మరాఠా సంఘం కార్యవర్గం ఎన్నిక

కుంటాల, సెప్టెంబరు, 22: కుంటాల మండల మరాఠా సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వెంకూర్ గ్రామంలో భైంసా మండల అధ్యక్షుడు రఘువీర్ పటేల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా వీర్బా పటేల్, అధ్యక్షులుగా సిందే సాయినాథ్ పటేల్, ఉపాధ్యక్షులుగా గోపాల్‌పటేల్, ప్రధా కార్యదర్శిగా మోరేకర్ మనోహర్ పటేల్ , జాయింట్ సెక్రటరీగా గణేష్ పటేల్, కోశాధికారిగా గోపాల్ పటేల్ ఎన్నికయ్యారు. వీరిని వెంకూర్ గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రశంసా పత్రాలు అదుకుంటున్న విద్యార్థులు

నిర్మల్, సెప్టెంబరు 22 : వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వశిష్ఠ ఇంపెల్స్ టెక్నోస్కూల్ విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ముచ్చింతల్‌లో శనివారం చినజియర్ స్వామి ఆశ్రమంలో ప్రజ్ఞావికాస్ ఈ పోటీలు నిర్వ హించాయి. తస్మిన్, సాత్విక మూడు వేల రూపాయల నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులను అభినం దించారు.

29 నుంచి ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరగతులు

నిర్మల్, సెప్టెంబరు 22 : ఈ నెల 29 నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజులపాటు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డైరెక్టర్ ఏ.రమణేశ్వర్ గౌడ్ ఆదివారం ఏఎన్‌రెడ్డి కాలనీక్లబ్ హౌస్‌లో ఉపాధ్యాయులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించి సందేహాలు తీర్చారు. జిల్లా విద్యాశాఖ ఆయనను సన్మానించింది.

గడ్డెన్నవాగు ప్రాజెక్టుగేట్ ఎత్తివేత

- 1174 క్యూసెక్కుల వరదనీటి విడుదల



వరద గేట్ నుంచి విడుదలవుతున్న నీరు

భైంసా, సెప్టెంబరు 22 : ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి శనివారం రాత్రి వేళ నుంచి వరద నీటి చేరిక ప్రారంభమైంది. 200 క్యూసెక్కులతో ప్రారంభమైన వరద నీటి చేరిక క్రమక్రమంగా పెరుగుతూ 1174 క్యూసెక్కులకు ఎగబాకింది.అప్పటికే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీల నీటి నిల్వలతో నిండుకుండలా మారింది. దీంతో నిర్వాహణాధికారులు ప్రాజెక్టులో ఎంత వరద నీరు వచ్చి చేరితే అంతె మొత్తంలో వరద నీటిని ఒక వరద గేట్‌ను ఎత్తివేసి సుద్దవాగులోకి వదిలి పెట్టారు. ఆదివారం ఉదయం వేళ నుంచి ప్రాజెక్టులోకి 1174 క్యూసెక్కుల వరద నీరు చేరగా అంతే మొత్తంలో వరద గేట్ ద్వారా సుద్దవాగులోకి వదిలారు. వరద నీటి చేరికకు అనుగుణంగా నీటివిడుదల చేపడుతామని ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వెల్లడించారు.

వైద్య పోస్టులపై అభ్యంతరాలుంటే తెలుపండి

నిర్మల్, సెప్టెంబరు 22 : వైద్య, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో నియమించే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల విషయంలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 30లోగా ఈమెయిల్ ద్వారా గాని కార్యాలయంలోనైనా సమర్పించాలని జిల్లా అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరిలో స్వీకరించామన్నారు. ప్రొవి జనల్ జాబితా ఎంపికైన వారి జాబితా ఆన్‌లైన్‌లో, జిల్లా కార్యాలయంలో అందుబాటులో ఉందని తెలిపారు. మొబైల్ హెల్త్ టీములో మెడికల్ అధికారులు, ఫార్మసిస్ట్, హెల్త్ వెల్‌నెస్ ప్రొవైడరు, ప్రోగ్రాం ఆఫీసర్, సైకాలజిస్ట్, స్టాఫ్ నర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కంమ్ అకౌంటెంట్, రిఫ్రిజిరేటర్ మెకానిక్, ఏఎన్ఎం పోస్టులకు దర ఖాస్తులు స్వీకరించమని తెలిపారు.

ప్రమాదకరంగా ఇచ్చోడ ప్రధాన రహదారి

● అధ్వానంగా రహదారి విస్తరణ పనులు ● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఇచ్చోడ, సెప్టెంబరు 22: ఇచ్చోడకు ప్రధాన రహదారి బురదమయంగా ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన గుత్తేదారు రహదారికి ఇరువైపులా చదును చేసి మట్టిలాంటి మొరం వేసి విస్తరించారు. తర్వాత గ్రేడ్‌లు గల కంకర వేసి తారు వేయాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. నెలలు గడిచినా పనులు నిలిచిపోవడంతో వర్షాకాలం కాస్తా ఎక్కడికక్కడ బురద తేలింది. బురదలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. గాయాలతో ఆసుపత్రిలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. పనులు నత్తనడకన సాగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. రహదారి విస్తరణ పనులు వాహనాలకు ఎంత పరీక్ష పెడుతున్నాయో తెలుపుటకు నిదర్శనం ఈ చిత్రాలు..

నామమాత్రంగా కొనసాగుతున్న పనులు

గుత్తేదారు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం జరిగిన నాసిరకం మట్టితో కూడిన మొరం పనుల్లో రహదారిపై వేయడంతో చిన్నవర్షానికీ బురదమయంగా మారుతోంది. ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతూ.. వాహనాలను నడుపతున్నప్పటికి అవి అదుపుతప్పి ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ దారిన పోవాలంటే ప్రయాణికులు జంకుతున్నారు.

రహదారి నిర్మించాల్సిన తీరు..

మండలకేంద్రంలో జరుగుతున్న డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రెండు వరసల రహదారి దాదాపు 2.6 కిలోమీటర్ల మేరన రహదారి భవనాల శాఖ అధికారులు రహదారిని నిర్మిస్తున్నారు. గతంలో ఈ రహదారి 33 ఫీట్లు ఉండగా 50 ఫీట్ల మేర రహదారి, 5 ఫీట్ల డివైడర్, రహదారి పక్కన ఇరువైపులా 5 ఫీట్ల మొరం వేయనున్నారు. ప్రస్తుతం రహదారిని మొత్తం 65 ఫీట్ల మేరన చదును చేస్తున్నారు. నాసిరకం మోరం చదునులో భాగంగా బురద మట్టి ఉండడంతో రహదారి బలంగా లేకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఇచ్చోడకు రావాలంటేనే భయంభయం

ఇచ్చోడ రోడ్డును చూసి బయటివ్యక్తులు ఇచ్చోడమండల కేంద్రానికి రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్డు మరీ ఇంత అధ్వానంగా తయారైందని.. మీ ఊరికి రావాలంటే భయమేస్తోందని చెప్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. వాహనాలు పాడవుతున్నాయని కొందరు, అదుపుతప్పి గుంతల్లో కూరుకుపోతున్నామని ఇంకొందరు చెప్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బురదమయంగా మారిన రహదారిపై అవస్థల ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు

త్వరలోనే రహదారి విస్తరణ పనులు పూర్తవుతాయి

● అరవింద్ ఆర్అండ్‌బీ ఏఈ

వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు పనుల్లో కాస్తా ఆలస్యమవుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటినుంచి పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇచ్చోడ ప్రధాన రహదారి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేయిస్తున్నాం. ఎక్కడా రాజీ పడడం ఉండదు. మా పై స్థాయిలోనూ నాణ్యతపై అధికారులు పరిశీలించి ధ్రువీకరిస్తారు.



రోడ్డుపై ఉన్న భారీ గుంతలు..



బురదలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయిన వాహనదారుడు (ఫైల్)



పురాతన చింతచెట్టుకు పూజలు

భైంసారూరల్, సెప్టెంబరు 22 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఆదివారం చింతచెట్టుకు దుర్గామాత రూపంలో వెలసినట్టు భావిస్తున్న గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. పరిసరాల ప్రాంతాల గ్రామ ప్రజలు చెట్టు వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

వినాయకుల నిమజ్జనంలో అపశృతి

● గల్లంతైన యువకుడు.. కుంటలో తేలిన మృతదేహం



రాకేష్ (ఫైల్)

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 22: వినాయక విగ్రహాల నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. క్రషర్ కుంటలో పడి గల్లంతైన ఓ యువకుడు మృతిచెందాడు. మండలం పరిధిలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన యువకులు గణపతి నిమజ్జన శోభయాత్రను నిర్వహించారు. అయితే పిప్రి గ్రామం వద్ద ఉన్న క్రషర్ కుంటలో నిమజ్జనాన్ని ఉదయం 3గంటల సమయంలో నిర్వహించారు. నిమజ్జనానికి వచ్చిన రాకేష్(22) నిమజ్జనం తర్వాత కనిపించడం లేదనే సమాచారం అందుకున్న పోలీసులు అందించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. నిమజ్జనం సమయంలో అందరితో కలిసిఉన్న రాకేష్ కనిపించకపోవడంతో స్టోన్‌క్రషర్ కుంటలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం మృతదేహాన్ని గజ ఈతగాళ్ల బయటకు తీశారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి సాగు చేస్తే క్రిమినల్ కేసులు: సీఐ

బజార్‌హత్నూర్, సెప్టెంబరు22: పంట చేన్లలో గంజాయి మొక్కలు సాగు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బోథ్ సీఐ బానోత్ రమేష్ అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని చిన్నుమియా తండా గ్రామంలో డాంగ్రె రాజు పంట పొలంలో అరవై గంజాయి మొక్కలు గుర్తించి వాటిని పీకేసి ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు డబ్బు ఆశకు పోయి గంజాయి మొక్కలను పెంచినట్లయితే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసామన్నారు. గంజాయి మొక్కల సాగును ప్రోత్సహించే వారి సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మైనింగ్ రాతిగుంతలు

● చోద్యం చూస్తున్న అధికారులు

బోథ్, సెప్టెంబరు 22: మైనింగ్ రాతి గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. బోథ్ నియోజకవర్గంలో 21 మైనింగ్ క్రషర్లు ఉన్నాయి. అవసరమైన కంకరరాయిని సిద్ధం చేసి తరలిస్తున్నారు. అయితే మైనింగ్ అధికారులు యాజమాన్యాలకు చూపించిన స్థలాలలో కాకుండా వేరే సర్వే నెంబర్లలో తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయా కంకర క్రషర్ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద గుంతలు తవ్వి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా ఉన్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి మైనింగ్ నిబంధన ప్రకారం మూడు ఫీట్ల కంటే లోతుగా తవ్వకూడదన్న ఆదేశాలు ఉన్న రాతి కోసం అడ్డగోలు తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో రాజకీయ ఆర్థిక బలంతో కొంత మంది వ్యక్తులు అడ్డగోలు తవ్వకాలు జరిపి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొంటున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. ఇచ్చోడ, బజార్హత్నూర్, గుడిహత్నూర్, మండలాల్లో విచ్చలవిడిగా కంకర తయారీ క్రషర్లు ఉన్నాయి. అయితే కంకర కోసం అవసరమైన రాయి కోసం చేపట్టిన గుంతలు ఒక్కో గుంట 10 ఫీట్ల వరకు ఉండటంతో వర్షాకాలంలో నీరు నిలిచి ప్రాణాలు పోతున్నాయి. గత వారం రోజుల క్రితం పిప్పిరి సమీపంలోని గుంతలో ఒక బాలుడు పడి చనిపోయిన ఘటన మరువక ముందే తాజాగా శనివారం గణేష్ నిమజ్జనం సందర్భంగా ఓ యువకుడు గుంతలో పడి చనిపోయాడు. అయినా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదని స్థానికులు వాపోతున్నారు. మైనింగ్ కోసం తవ్విన గుంతల చుట్టూ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

ఖానాపూర్, సెప్టెంబరు 22 : విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన కథనం ప్రకారం... పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల రాజమల్లు (63) అనే వ్యక్తి ఆదివారం తన పశువుల కొట్టం వద్ద విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసే క్రమంలో రెండు వైర్లను జాయింట్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో రాజమల్లు పెద్దగా అరుస్తూ అక్కడే పడిపోయాడు. రాజమల్లు అరుపును గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అక్కడికి చేరుకొని రాజమల్లును ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో రాజమల్లును పరీక్షించి వైద్యులు అప్పటికే అతను చనిపోయినట్లు తెలిపారు. మృతిచెందిన రాజమల్లుకు భార్య గంగవ్వ, కుమారుడు, కూతురున్నారు. భార్య గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం

● బీజేవైఎం భైంసా డివిజన్ ప్రతినిధి

భైంసా, సెప్టెంబరు 21 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం భైంసా డివిజన్ ప్రతినిధి గంగాప్రసాద్ (వాలేగామ్) డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతోపాటు కల్తీ నెయ్యి, చేప నూనెను వినియోగించారంటూ వస్తున్న కథనాలు భక్తులు, హిందువుల మనోభావాలను తీవ్రంగా కలిచి వేస్తున్నాయన్నారు. లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించడానికి, టీటీడీపై కోట్లమంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని సడలించేందుకు జరిగిన కుట్రగా దీనిని భావిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో లోతైనా విచారణ జరిపి దోషులు, బాధ్యులందరిపై కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

నర్సాపూర్(జి), సెప్టెంబరు 22 : మండల కేంద్రంలోని ముప్పై పడకల ఆసుపత్రిలో స్థానిక ఎమ్మెల్యే బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మండల నాయకులు నార్వాడే ప్రవీణ్, సవీన్, సాయికృష్ణ, రాము, గంగారాం, విజయ్, రమాకాంత్, నారాయణ, సుదర్శన్ రెడ్డి, అశోక్, అనిల్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నేరడిగొండ, సెప్టెంబరు 22: తెలంగాణ అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సాధించిన పార్టీతోనే సాధ్యమని, నేరడిగొండ మండలంలోని కోరిటికల్ గ్రామానికి చెందిన తిత్రేచందర్‌సింగ్ ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసంలో పలువురు వివిధ పార్టీ నేతలకు బీఆర్ఎస్ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చందర్‌సింగ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసమే తెలం గాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీలోకి చేరానని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అడుగుజాడల్లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వెంటే ఉంటానని తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు సహకరించాలని ఎల్లప్పుడు ప్రజల్లో ఉండాలని రాబోయే ప్రభుత్వం ముమ్మాటికి మనదే అని అన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానకసింగ్, ప్రతాప్‌ఉన్నారు.

హైడ్రాకు చట్టబద్ధతపై మాజీ కేంద్ర మంత్రి హర్షం

నిర్మల్, సెప్టెంబరు 22 : రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని తీసుకున్న నిర్ణయం పట్ల మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి హర్షం ప్రకటించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి కార్మికులకు బోనస్, ఒప్పంద కార్మికులకు రూ.5 వేలు అందజేస్తామని ప్రకటించడం సరైన నిర్ణయమని పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నిర్మల్, సెప్టెంబరు 22 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్మశాన వాటికలో ఆదివారం అనాథ శవానికి యువకులు అంతిమ సంస్కారం నిర్వహించారు. హెల్పింగ్ హాండ్స్ హ్యాపీ ఫేస్ఎస్ సభ్యులు యోగేష్, అమ్మసాయి, నవీన్, తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమంలో యువత ముందుండాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీని కలిసిన ఉద్యమకారులు



సన్మానిస్తున్న ఉద్యమకారులు

బోథ్, సెప్టెంబరు 22: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఆదివారం వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి సన్మానించారు. గతంలో ఈ ప్రాంతంలో చేపట్టిన ఉద్యమతీరు గురించి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి వివరించారు. భవిష్యత్తులో బోథ్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరడం జరిగిందని ఉపాధ్యాయ ఉద్యోగ తెలంగాణ పోరాట సమితి జిల్లా నాయకులు రావుల శంకర్, తక్కుల శ్రీనివాస్‌రెడ్డి, భవాని ఆనంద్, ఎస్. ఈశ్వర్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఘనంగా ముగిసిన గణేష్ నిమజ్జన ఉత్సవం

బోథ్, సెప్టెంబరు 22 : మండలంలోని కౌటా(బీ) గ్రామంలో ఆదివారం గణేష్ నిమజ్జన ఉత్సవం ముగిసింది. శనివారం సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్ర ఆదివారం ముగిసింది. స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో రాత్రి పగలు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా యువకుల మధ్య కొట్లాటలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. స్థానికులు సైతం సహకారం అందించారు. ఏది ఏమైనా నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.



నృత్యాలు చేస్తున్న యువకులు

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం అభినందనీయం

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి



సభ్యులను సన్మానిస్తున్న రవీందర్

ఆదిలాబాద్, సెప్టెంబరు 22:పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం, వినాయక చవితికి మట్టి వినాయకుడిని పూజించాలని హిందు సమాజ్ ఉత్సవ సమితి పిలుపు నిచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో హిందు సమాజ్ ఉత్సవ సమితి సభ్యులు హనుమాన్లు, ఉదయ్, రమేష్‌సాగర్, వెంకటేశ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ కోసం గత 36 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి వినాయక చవితి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తు వస్తుందన్నారు. ఈ సంవత్సరం హిందు జాగరణ ఉత్సవ సమితి ముందుకు రావడం అభినందనీయమని వారిని జనవిజ్ఞాన వేదిక తరపున సన్మానించారు. ఇందులో దండనాయక ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, రామగిరి శివకుమార్, శ్రీనివాస్‌గౌడ్, గంగన్న, శ్రీధర్‌బాబు, విఠల్, సంజీవరెడ్డి, లింగన్న తదితరులున్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించండి

● మంత్రి సీతక్కకు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 22: ఇంద్రవెల్లిలో అంబేద్కర్ భవన్, కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని మండల దళిత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఉట్నూర్‌లోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేతో కలిసి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. అలాగే మండల దళిత సంఘాల నాయకులు మంత్రిని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, పట్టణ అధ్యక్షులు ఎం.డి. జహీర్, నాయకులు సోమోరే నాగోరావు, తదితరులు ఉన్నారు.

49వ వార్డులో సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే పాయల్ శంకర్



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని 49వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం వాల్మీకి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 49వార్డులో అనేక రకమైన సవస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్డు లేక, ప్రజలకు మంచినీటి సరఫరా లేక ఇబ్బందులున్నాయన్నారు. వాల్మీకి నగర్‌లో డ్రైనేజీ దుర్గంధవాసనతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దశల వారీగా వార్డుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రేడ్‌వన్‌గా మారిన మున్సిపాలిటీకి అనేక రకమైన సౌకర్యాలు అవసరం అన్నారు. ఇది వరకే ఇంజనీర్ అధికారులు ప్రాథమిక సర్వే పూర్తి చేశారన్నారు. వాటి ఆధారం తోపాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.320 కోట్లు సరిపోవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మరిన్ని నిధులు తీసుకొచ్చి తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ ప్రభుత్వం లేనప్పటికీ ఏ చిన్న అవకాశం వచ్చినా తన వంతుగా పట్టణాభివృద్ధికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో సభ్యత్వాలు ముమ్మరం చేయాలి

ముథోల్, సెప్టెంబరు 22 : అందరూ సమష్టికృషితో ఈ నెల 25 వరకు బూత్‌స్థాయిలో సభ్యత్వాలు ముమ్మరంగా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ముథోల్ కార్యవర్గ సమావేశంలో హాజరై మాట్లాడారు. ఈనెల 25న పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిబూత్ స్థాయిలో 200ల మంది ప్రజలకు బీజేపీ సభ్యత్వం తీసుకునేలా ప్రణాళికతో ముందు కెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులకు ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 25 లోపు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో ముథోల్ పట్టణంలో భారీసంఖ్యలో సభ్యత్వాలు చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సభ్యత్వం నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు పైడిపల్లి గంగాధర్, సామ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణ రెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ శ్రీనివాస్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ బూసి రవి, మండల అధ్యక్షులు కోరి పోతన్న, ఆర్. గంగాధర్, సుష్మిత రెడ్డి, బీజేపీ నాయకులు సతీష్ రెడ్డి, సుదర్శన్, టి.రమేష్, రాజుల రఘునాథ్, గంగాధర్, రాజు, రవి కుమార్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికే..

నేరడిగొండ, సెప్టెంబరు 22: మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పాల్గొని సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కృషితోనే గతంలో 12 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ పార్టీ ఈ సారి రెట్టింపు ఉత్సాహంతో 25కోట్ల సభ్యత్వాలే లక్ష్యంగా నిర్దేశాన్ని ఎంచుకుందని ఇట్టి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలు పార్టీలో భాగస్వాములు కావడానికి సిద్ధంగా ఉన్నారని, బీజేపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరిని బీజేపీ కుటుంబంలో ఆహ్వానించాలని అన్నారున. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్, మాజీ సర్పంచ్ పరశురాం, బీజేవైఎం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు తారాసింగ్, కర్తార్‌సింగ్, సౌందరయ్య, న్యాల్‌సింగ్, అమర్‌సింగ్, రాంసింగ్, విజయ్, జ్ఞాన్‌సింగ్, జగదీశ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వైపు యువత చూపు

నిర్మల్, సెప్టెంబరు 22 : బీజేపీలో సభ్యులుగా చేరేందుకు స్వచ్ఛందంగా యువత ఆసక్తి చూపుతోందని రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. ఆదివారం ద్యాగవాడలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు నిదర్శనంగా వేలాది మంది పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. అమెరికాలో రాహుల్‌గాంధీ దేశ ప్రతిష్ట దెబ్బతీ సేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు విజ యవంతం చేయాలని శ్రేణులు కోరారు. నాయకులు మూడారపు దిలీప్, రచ్చ మల్లేష్, కార్తీక్, దశరథ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెదిన లోకారి గ్రామానికి చెందిన యువ రైతు గేడం ప్రభాకర్ వరద బాధితులకు ఆర్థిక సాయం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు రుణమాఫీలోని రూ.లక్షా నుంచి ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి తనవంతు సహాయంగా రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు అందజేశారు. అకాల వర్షాలకు రాష్ట్ర ప్రజలు సర్వస్వం కోల్పోయారని వారిని చూసి మనసుకు బాధ కలిగిందన్నారు. విపత్తుల వలన నష్టం జరిగితే ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవాలని, అప్పుడే అందరం మనోధైర్యం కోల్పోకుండా ఉంటారన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం చేపట్టే కార్యక్రమాన్ని రూరల్ మండలంలోని లోకారి గ్రామం నుంచి ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, విశ్వనాథ్, నవీన్, శుక్మత్ పాల్గొన్నారు.

తలసేమియా, ఇకిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: తలసేమియా, సికిల్‌సెల్ రోగుల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఎంపీ నివాసంలో ఎంపీ గొడం నగేష్‌కు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. తలసేమియా, సికిల్ సెల్ రోగులకు రిమ్స్ మెడికల్ కళాశాలలో రక్తం ఎక్కించే సెంటర్ ప్రారంభించాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం అందించే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, ఇన్నోసైట్స్ హెల్త్ కేర్ అసోసియేట్స్ వైద్యులు డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ ఓంకార్ నాథ్, మిత్ర బృందం డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక సంయుక్త ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: జిల్లాకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్‌సీసీ 32 తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సంయుక్త శిక్షణ శిబిరం-7 ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా కమాండింగ్ అధికారి కల్నల్ వికాస్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా ప్రకృతి విపత్తులు వచ్చినా, యుద్ధాలు సంభవించినా సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని తెలిపారు. దేశంలోనే రెండో బాల సైన్యంగా గుర్తింపు పొందారన్నారు. అనంతరం ఎన్‌సీసీలోని ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన కెడెట్లను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుబాదేర్ మేజర్ భగీరథ్, ఏఎన్‌వోలు అంతర్వేది జగ్రాం, గాలి అశోక్, నరేందర్, స్వామి, రజిత, శ్రీనివాస్, సాయినాథ్, రాజేశ్వరి, పూర్ణచందర్ రాజానందం, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుతో భవిష్యత్తు మార్పు

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: ప్రజాయుద్ధ నౌక గద్దర్, జహీరోద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభకు హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి వారికి ఘనస్వాగతం పలికారు. గద్దర్‌సేవలను స్మరించుకునేందుకు ఆదిలాబాద్ జిల్లాకు రావడం తమ అదృష్టమన్నారు. ప్రజాస్వామ్యం ఇచ్చిన రెండు ఆయుధాలు భారత రాజ్యాంగం ఓటు హక్కుతో మన భవిష్యత్తు మనమే మార్చుకోవచ్చన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన వారు ప్రజా ప్రతినిధిగా ఉంటేనే వారి సమస్యలు అర్థమవుతాయని పేర్కొన్నారు. తన తండ్రి చివరి శ్వాస ఉన్నంత వరకు పాటే ప్రాణంగా పేద బడుగు అణగారిన బలహీన వర్గాల గొంతుకై వారి ఊపిరిగా బతికాడన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరామ్‌ను తెలంగాణ జాతిపితగా చిన్నబాపుగా కంది శ్రీనివాస్‌రెడ్డి వర్ణించారు. అలాంటి వ్యక్తి తన ఆఫీసుకు రావడం తన అదృష్టమన్నారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, జైనథ్, బేల మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోకొరెడ్డి, వైస్ చైర్మన్ విలాస్‌పటేల్‌సావపురే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, ఎంఏ షకీల్, తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, సందనర్సింగ్, జాఫర్ అహ్మద్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బాదన్నగంగన్న, శ్రీలేఖ పాల్గొన్నారు.

భార్య- భర్త, ఇద్దరు కొడుకులు

●ఆదిలాబాద్ నుంచి తెచ్చుడు ●హైదరాబాద్‌లో అమ్ముడు

●డబ్బు సంపాదన కోసం.. ●గంజాయి స్మగ్లర్స్‌గా మారిన కుటుంబం

●హెచ్ న్యూ పోలీసులకు చిక్కిన కటకటాలపాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి మండలం షాబాద్‌కు చెందిన ఓ ఆటోడ్రైవర్ బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి రాజేంద్రనగర్‌లో ఉంటూ ప్యాసింజర్ ఆటో నడుపుతున్నాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తన భార్య ఇద్దరు కొడుకులతో కలిసి గంజాయి సరఫరా చేస్తూ అడ్డదారిలో డబ్బు సంపాదిస్తున్నాడు. చివరకు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులకు చిక్కి కుటుంబంతో సహా.. కటకటాలపాలయ్యారు. డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన బ్యాగరి అనంతయ్య (53) కొన్నాళ్లుగా కుటుంబంతో సహా.. రాజేంద్రనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య నీరజ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్ ఉన్నారు. భార్య ఇంట్లోనే ఉంటుండగా.. పెద్దకొడుకు ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే వచ్చే సంపాదన సరిపోకపోవడంతో అనంతయ్య తన భార్య, కొడుకులతో చర్చించి సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. నగరంలో గంజాయికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో గంజాయి సరఫరా చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు.

● ఆదిలాబాద్ నుంచి నగరానికి దిగుమతి..

ఆదిలాబాద్‌కు చెందిన గంగన్న మొదట వ్యవసాయం చేసేవాడు. ఆ తర్వాత వ్యవసాయం వదిలేసి గంజాయి సప్లైయర్‌గా మారాడు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన రైతుల వద్ద గంజాయిని సేకరించి దాన్ని నగరంలోని ప్రధాన స్మగ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. గత రెండేళ్లుగా గంగన్న ఆదిలాబాద్ నుంచి గంజాయిని తెచ్చి అనంతయ్యకు ఇచ్చేవాడు. ఆ తర్వాత అనంతయ్య భార్య నీరజ గంజాయిని చిన్ని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేసేది. వాటిని అనంతయ్యతో పాటు.. ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్‌లు తీసుకెళ్లి నగర శివారు ప్రాంతాల్లోని గంజాయి సేవించే కస్టమర్స్‌కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాస్, డేనియల్ టీమ్ అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి ఎంజీబీఎస్ బస్టాండ్‌లో అనంతయ్యను, ఆదిలాబాద్‌కు చెందిన గంగన్నను పట్టుకున్నారు. అనంతరం అనంతయ్య భార్య నీరజ, చిన్న కొడుకు రవికాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, ఒక ఆటో, రూ. 3,400 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

నార్నూర్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రంలో హత్యకు గురైన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థి రాథోడ్ జితేందర్ మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నార్నూర్ మండల బోర్‌గావ్‌లో జితేందర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతునికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. వారి వెంట గ్రామ ప్రజలున్నారు.

బంగారు పతకం సాధించిన గురుకుల విద్యార్థిని

ఉట్నూర్, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థిని జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించిందని కళాశాల బనోత్ హరిత తెలిపారు. కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న అశ్విని ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని జైజంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించగా కళాశాల ప్రిన్సిపల్ భానోత్ హరిత, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుషి పంచమి ఉత్సవాలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 22: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని రాంసింగ్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని అందునాయక్ తండా గ్రామంలో రుషి పంచమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ రుషి పంచమి ఉత్సవాల్లో రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన మథుర సమాజ్ (లబాన్) కులస్తులు, యువకులు, మహిళలు వేర్వేరుగా సంప్రదాయ నృత్యాలు చేస్తూ వాళ్ళ మథుర బాషలో పాటలు పాడుతూ కోలాట నృత్యాలు చేశారు. గ్రామంలోని జ్వాలాముఖి దేవి, కాశబాబా, పచుబాబా ఆలయ ఆవరణలో రాంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి రుషి పంచమి ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం రాంసింగ్ మహారాజ్‌ను దర్శించుకున్నారు. కులపెద్దలు ఆలయ ఆవరణలో సంప్రదాయ పచ్చీస్ ఆటను ఆడారు. కార్యక్రమంలో గ్రామస్తులు చోపాడే బద్దుసింగ్, వడ్వాల్ గోపాల్‌సింగ్, గేబిసింగ్, షేర్‌సింగ్, చందాసింగ్, కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ఆదివారం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఆరేల్లి రాజలింగు అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలు బూత్‌స్థాయిలో ఇంటింటికి వెళ్లి పార్టీ బలోపేతం చేస్తూ రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మురప రాజు, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

తలమడుగు, సెప్టెంబరు 22 : మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ కుమారుడు మెస్రం మహేందర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా దరి గ్రామానికి చెందిన బోరుగుల సుజాత ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, పిడుగు అగ్రమ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో భాగస్వాములు కావాలి

తలమడుగు, సెప్టెంబరు 22: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ యువమోర్చా మండల కన్వీనర్ తాతాజీ కిరణ్ కోరారు. ఆదివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని బీజేపీ కుటుంబ సభ్యులుగా చేరాలని తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామంలో ప్రధాన మంత్రి నరేంద్రమోది పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చ తలమడుగు మండల అధ్యక్షుడు దాతాజీ కిరణ్, లోగిటి పోచన్న, తిప్పవేణి, గంగాధర్, గంధం నరేష్, పూలవేణి రామన్న, పర్తం బుచ్చులు, పూలవేణి శ్యామ్, బర్ల సతీష్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జెండావిష్కరణ

భీంపూర్ రూరల్, సెప్టెంబరు 22: మండలంలోని పిప్పల్‌కోటిలో సీపీఎం పార్టీ గ్రామ శాఖ 2వ మహాసభలు నిర్వహించారు. ఆటోస్టాండ్ వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీఐటీయూ కార్యదర్శి బొజ్జు ఆశన్న, నాయకులతో కలిసి జెండావిష్కరించారు. ప్రభుత్వం పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూ నివాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా దోనిపెల్లి స్వామిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ టాలెంట్ టెస్ట్

బోథ్, సెప్టెంబరు 22: ఈనెల 28 భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ప్రగతి పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ టాలెంట్ టెస్టును నిర్వహించడం జరిగింది. పరీక్ష రాసేందుకు గాను మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం పరీక్షలను నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుమీర్ పాషా, నాయకులు సిరిపురం దాస్, ప్రేమ్, ముస్కిప్, నరేష్, కార్తీక్, సంతోష్‌లతో పాటు ఉపాధ్యాయులు అల్లంసాయి కృష్ణ చంద్రమోహన్,సుకుమార్, నరేష్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు ముక్రుద్దీన్ రాజు, రవి, అజయ్‌లున్నారు.





● ఉట్నూర్‌లో బైక్ అంబులెన్స్‌లకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఏజెన్సీకి.. సత్వర వైద్యం!



● గిరిజన గ్రామాలలో సత్వర వైద్యం కోసం బైక్ అంబులెన్స్‌లు



● ఏజెన్సీలోని గిరిజన గ్రామం

- మారుమూల ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల కోసం బైక్ అంబులెన్స్‌ల ఏర్పాటు
- ఆదివాసీ, గిరిజనులకు మరింత చేరువగా వైద్య సేవలు
- ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో గ్రామాల ఎంపిక
- 10 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 104 గ్రామాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం



ఉట్నూర్, సెప్టెంబరు 22: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంటే మారుమూల గిరిజన గ్రామాలలో ఎలాంటి వ్యాధులు రానివ్వమని, వ్యాధులు వ్యాపిస్తే.. హెలికాప్టర్ అంబులెన్స్ ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందిస్తామని గత పాలకులు చెప్పిన హామీలు నీటిమూటలయ్యాయి. కాగా, ప్రస్తుతం తెలంగాణలో ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గిరిజన గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడానికి బైక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తేవడం పట్ల ప్రజలు హర్షిస్తున్నారు. కాగా, ఉట్నూర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌తో పాటు ఎమ్మెల్సీ దండే విఠల్‌ల చేతుల మీదుగా బైక్ అంబులెన్స్‌ల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఐటీడీఏలకు పదేసి బైక్ అంబులెన్స్

ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని ఐటీడీఏలు ఉన్న ఉట్నూర్, ఏటూరు నాగారాం, భద్రాచలం, మన్ననూరుఐ టీడీఏలకు పదేసి బైక్ అంబులెన్స్‌ల చొప్పున 40 బైక్ అంబులెన్స్‌ను కుటుంబ సంక్షేమ ఆరోగ్యశాఖ కమిషనర్ నుంచి ఐటీడీఏలకు బైక్ అంబులెన్స్‌లను పంపించారు.

పీవో ఆధ్వర్యంలో గ్రామాల ఎంపిక

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి (ఏజెన్సీ) ఆధ్వర్యంలో ఉన్న గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వందకు పైగా గ్రామాలను అధికారులు ఎంపిక చేస్తున్నారు. అంతేకాకుండా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహార్ ఆధ్వర్యంలో ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మొత్తం 104 గిరిజన గ్రామాలను గుర్తించినట్లు తెలుస్తుంది.

104 గిరిజన గ్రామాల ఎంపిక

ఏజెన్సీ ప్రాంతాలలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న కొండాపూర్, వాల్గొండ, కేస్లాపూర్ సబ్ సెంటర్లో పరిధిలో ఉన్న బీంపూర్, తుమ్మలపాడు, లక్కంపూర్, మామిడిగూడ, టి గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ తండా, లేండిగూడ, చిత్తబట్ట, ఝరిపీహెచ్‌సీ పరిధిలో డాబా, అర్జునిసబ్ సెంటర్ల పరిధిలో ఉన్న బుల్లికాసా, సావరి, పావనూర్, లొద్దిగూడ, పున్నగూడ, చిన్నకుండి, పెద్దకుండి, పిప్రి, గాదగూడ పీహెచ్‌సీ పరిధిలో మేడిగూడ, డాబాకే, ఖండాల సబ్ సెంటర్ల పరిధిలోని సెడ్వాయి పున్నగూడ, డొంగర్‌గావ్, కొటాలన కొన్ని కాసా, బుల్లికాసా, సాయిగూడ, చిలాటిగూడ, సేవ్‌గూడా, కొత్తగూడ, రాజుగూడ, లోహారా(సి), దారులొద్ది, అంకోలి పీహెచ్‌సీ పరిధిలో చెంచుదరి ఖానాపూర్, వాఘాపూర్, రామాయి, యాపల్‌గూడ సబ్‌సెంటర్ల పరిధిలో అల్లికోరి, హత్తిట్టు, చించుధరి, పొట్టంలొది, మారేగావ్, తిప్ప, దేవదాస్‌నగర్, రాజ్‌అసోడా, గుండంలొద్ది, గుండంలొది(బి), గుండంలొద్ది(ఏ), జెండాగూడ, కోలాంగూడ, రామాయి, అడ్డగుట్ట(ఏ), అడ్డగుట్టబి, శివఘాట్, మేడిగూడ, రాంపూర్, సోనేరావుగుట్ట, కుంబేఝురి, టాక్లి, కొత్తగూడ, యశ్వంత్‌గూడ, రాములుగూడ, మత్తడిగూడ, బుర్నూర్, బంగారిగూడ ఉంది. అలాగే నర్సాపూర్(టి) పీహెచ్‌సీ పరిధిలోని సిరిచెల్మ సబ్ సెంటర్ కింద ఉన్న నారాయణపూర్, కుంటగూడ, రాంజీగూడ, బాబ్జిపేట్, లింగాపూర్, పీహెచ్‌సీ పరిధిలో ఉన్న లింగాపూర్ పరందోళి సబ్ సెంటర్లలోని కన్నెపల్లి, పుట్టభద్రత, లేండిజాల, ముకుంద గూడ, గౌరీ, లేండిజాల, లక్మాపూర్, జనకాపూరి, బోరిలాల్ గూడ, కొలాంగూడ, గౌరియాగూడ ఉన్నాయి. అలాగే వాంకిడి పీహెచ్‌సీ పరిధి లోని బంబారా, కిన్నెర్‌గావ్, చిచ్చుపల్లి, ఇందాని, కిరిడిసబ్ సెంటర్లలో కాడేగావ్(ఏ), కాడెగాం(బి), సీతాగూడ, పిప్పల్ గుండి, కన్నాపూర్, డొంగర్గావ్, గడుమరుగు, టోకికూడా, ఈనో లి, గిన్నెదరి పీహెచ్‌సీ పరిధిలోని పంగిడి మదరా, దేవరగూడ, గిన్నెదరి సబ్ సెంటర్ ఇళ్లలో ఉన్న రాగాపూర్, సీతారాంనాయక్ తండా, పూసిగూడ, గోవెన, చందుగూడా, తోయగూడ, కోరటంక, రొంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మంగి, గుండాల సబ్ సెంటర్లలోని పాటకూడ, శ్రీరాంపూర్ గూడ, ఎర్రబండ, కోటగావ్, పూసిభూమి, గోపేరా, బొజ్జగూడ, రాజగూడ, బోరేద్యాంకూడా, అరుజుగూడ, పున్నగూడ గ్రామాలలో బైక్ అంబులెన్స్‌ల ద్వారా సత్వర వైద్య సేవలను అందించాలని భావిస్తున్నారు.



● ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

గిరిజన గ్రామాలకు సత్వర వైద్య సేవలు

: డాక్టర్ కుడిమెత మనోహార్, ఏడీఎంహెచ్‌వో(ఏజెన్సీ)



ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతంలోని మొత్తం 104 గిరిజన గ్రామాలను ఎంపిక చేశాం. దీనిలో భాగంగా రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా బైక్ కంప్లైంట్‌లను ప్రారంభించారు. కాగా, బైక్ అంబులెన్స్‌ల బాధ్యతలు హెల్త్ అసిస్టెంట్లకు అప్పగించడం జరిగింది.

సంక్షిప్త సమాచారం

రేపు బస్సు పాస్‌ల మేళా

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 22: మండలంలోని దివ్యాంగులకు ఈనెల 24న బస్సు పాస్‌ల స్పెషల్ క్యాంప్ మేళాను నిర్వహిస్తామని ఉట్నూర్ బస్సు డిపో సూపరింటెండెంట్ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా బస్సు డిపో డీఎం కల్పన ఆదేశాల మేరకు ఈనెల 24న మండలంలోని సమాక చౌరస్తాలోని రాంనగర్ గ్రామంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగులకు 50 శాతం రాయితీ బస్సు పాస్‌ల జారీ చేస్తామని తెలిపారు. మండలంలో నివసించే దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగులు వారితో పాటు ఒక పాస్ ఫొటో, సదరం సర్టిపికెట్, ఆధార్ కార్డులు తీసుకు రావాల్సి ఉంటుందని వివరించారు.

7న జంగుబాయికి దీపారాధన

నార్నూర్, సెప్టెంబరు 22: ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయికి అక్టోబరు 7న దీపారాధన చేయడం జరుగుతుందని తుమ్రం మాన్కుపటేల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటా పరుందళిరాయితాడ్ జంగుబాయి దసరా ఉత్సవాలకు సంబంధించిన సమావేశాన్ని ఎనిమిది గోత్రాల అన్నదమ్ముల సమీక్ష సమావేశం గుండాల గ్రామం వద్ద జరిగింది. ఈ ఉత్సవాలకు ఇతర రాష్ట్ర ప్రజలు భక్తులకు భారీఎత్తున వస్తారు, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడవల్సిన బాధ్యత మనదే అన్నారు. వారి వెంట కమిటీ సమన్వయ కర్తతురం సంతోష్ ప్రభ గంగారాం తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

బోథ్, సెప్టెంబరు 22: మండలంలోని సాకేర గ్రామ పంచాయితీలో గల సూర్యనగర్ గ్రామంలో గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. సీసీ కెమెరా ప్రారంభోత్సవానికి స్థానిక ఎస్సై ప్రవీణ్‌ను ఆహ్వానించారు. సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్సై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల అవసరం ఎంతగానో ఉందని గ్రామస్తులు ముందు చూపుగా తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయం అన్నారు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ధరావత్ గుండేరావు, జాదవ్ గోపాల్, ధరావత్ రమేష్ జాదవ్, గోపిచంద్, కిషోర్‌కుమార్ జాదవ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్తలేమిని అధిగమించేందుకే గిరి పోషణ మిత్ర

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ● ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రారంభం ● పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మంత్రికి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉట్నూర్, సెప్టెంబరు 22: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికల్లో రక్తలేమిని అధిగమించడానికి గిరి పోషణ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరి పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గిరిజన ప్రాంతంలోని బాలికలు మహిళలు ప్రతి ఒక్కరు సీజనల్ పండ్లు కూరగాయలు తినాలన్నారు. కలుషితం లేని ఆహారం తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నెలసరి సమయంలో రక్తలేమి ఉండడం వల్ల బాలికల్లో కడుపునొప్పి, తదితర ఇబ్బందులు వస్తాయని దీన్నినిర్మూలన కోసమే గిరి పోషణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ అడవి ప్రాంతాలలో బుద్దికూర, బొడకాకర లభిస్తాయని, ఇండ్ల పెరట్లో పండించే కూరగాయలు తినడం ద్వారా రక్తలేమిని అదిగమించవచ్చని అన్నారు. గొంగూర, ఇప్ప పువ్వు లడ్డులలో ఐరన్ ఉంటుందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పేదరికంతో ఉన్న గిరిజనుల్లో రక్తహీనత అధిక శాతం ఉందని, ప్రతి ఒక్కరు ప్రకృతిలో లభించే ఆహారం పూజించాలని అన్నారు. ప్రభుత్వం పోషఖ విలువలు కూడిన ఆహారం అందించడానికి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుకుంటున్న విద్యార్థులకు చక్కని మెను అందిస్తుందని, వార్డెన్లు కక్కుర్తి పడకుండా మెను ప్రకారం భోజనం పెట్టాలన్నారు. టీచర్లు ప్రతిరోజు కొత్త విషయాలు తెలుసుకొని విద్యార్థులకు తెలపాలని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి తమ విద్యార్థులు అత్యున్నతమైన విద్యార్థులు ఎదిగేలా చూడాలన్నారు. మంచి పనులు చేసే అధికారులకు ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పదవ తరగతి అనంతరం విద్యార్థులు చదువులు మధ్యలో ఆపకుండా ఇంటర్ డిగ్రీ, తదితర ఉన్నత చదువులు చదువుకోవడానికి ముందు ప్రణాళికలు సూచించాలన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేపట్టిన గిరి పోషణ మిత్ర కార్యక్రమాన్ని మిగత ఐటీడీఏ ప్రాంతాలలో కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనతను అదిగించడంతో పాటు సికిల్ సెల్ నిర్మూలన క ఓసం కృషి చే స్తున్నామన్నారు. ప్రతీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య దీపికలు నిర్వహించి ప్రతీ గురు శుక్రవారాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ గిరి పోషణ మిత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఏపీవో సేవలు అభినందనీయమఅన్నారు. రక్తహీనత నిర్ధారణ చేసి పోషక విలువలు కూడిన ఆహారం అందుబాటులోకి తేవడం బాగుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాలు ప్రసంగించగా.. ఏపీవో జనరల్‌జాదవ్ వసంతరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ మనోహార్, డాక్టర్ కోవా అనురాధా, హెచ్‌ఎం మోతిరాం, ఏటీడబ్ల్యువో క్రాంతికుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీవేణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, ఖయ్యూం, ఎక్‌బాల్, తదితరులు పాల్గొన్నారు.

● ఆదివాసీ సోదరిపై జరిగిన దారుణం బాధాకరం

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలంలో ఆదివాసీ సోదరిపై జరిగిన సంఘటన దారుణమని, ఈ సంఘటన అనంతరం జరుగుతున్న పరిణామాలపై శాంతి నెలకొల్పడానికి రెండు రోజులుగా ఆదివాసీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం కూడా ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసు అధికారులు, ఖానాపూర్ ఎమ్మెల్యే ఐటీడీఏ ఏపీఓతో కలిసి సమావేశం నిర్వహించామన్నారు. అదేవిధంగా స్థానిక ఆదివాసీ నాయకులు చాలా సమస్యలు తమ దృష్టికి తేవడంతో పాటు వారి ఆవేదన తెలిపారు.



సంప్రదాయ నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఘనంగా ఋషి పంచమి వేడుకలు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 22: మండలం పరిధిలోని చందునాయక్ తండా గ్రామంలో ఘనంగా నిర్వహించిన ఋషి పంచమి వేడుకల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గోడం నగేష్ ఆదివారం పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థులంతా కలిసికట్టుగా ప్రతీ సంవత్సరం ఈ పండుగను గనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషకరం అన్నారు. అనంతరం వారు సంప్రదాయ నృత్యాలను గ్రామస్థులతో కలిసి చేశారు. మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, చట్ల గజ్జయ్య, దుబ్బుల శేఖర్, కవీందర్, తదితరులు పాల్గొన్నారు.



కరత్వాడ ప్రాజెక్టు వద్ద పార్కులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

లక్షలతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు!

బోథ్, సెప్టెంబరు 22: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు వద్ద గత మూడేళ్ల క్రితం నిర్మించిన పార్కు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. పార్కు వద్ద పర్యాటకుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోగా.. పార్కు స్థలంలో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. అంతేగాక పార్కుపైన ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించకపోవడంతో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన ట్రాక్పై ఉన్న రాయి లేచిపోతోంది. శిథిలమై పోతున్న పార్కును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పార్కు అభివృద్ధి చేస్తే స్థానికులకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉందంటున్నారు.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర కీలకం

● సంస్మరణ సభలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ● హాజరైన గద్దర్ కూతురు వెన్నెల



● ఎస్టీయూ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, తదితరులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 22: తెలంగాణ ప్రజల గొంతుకగా గళమెత్తిన ఉద్యమకారుడు, తొలిమలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చి తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన కళాకారుడు గద్దర్ అని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ప్రజాయుద్ధ నౌక గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరొద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కూతురు వెన్నెలతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గద్దర్, జహీరొద్దీన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ఒక మనిషి తన కోసం కాకుండా.. ప్రజల కోసం బతకాలని, అప్పుడే చరిత్రలో ఆయన గురించి మాట్లాడుకుంటారన్నారు. గద్దర్ కూడా నిత్యం తనకోసం, కుటుంబం కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పరితపించేవారన్నారు. ప్రజా ఉద్యమాలను నిర్మించి తన ఆటపాటల ద్వారా చైతన్యం రగిల్చారన్నారు. అలాగే సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ సైతం పత్రిక ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కళాకారులకు మేధావులకు తాడిత పీడిత ప్రజలకు అండగా నిలిచి ఎన్నో కథనాల ద్వారా తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపారన్నారు. వారి త్యాగాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని, వారి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారిద్దరి ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

● 'ఉద్యమ స్ఫూర్తి రగిల్చిన వ్యక్తి గద్దరన్న'

కన్నీళ్లను కత్తులుగా మార్చి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గద్దరన్న ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని, ఆయన జీవిత చరిత్రను భావితరాలకు తెలియజెప్పి వారిని చైతన్యవంతులుగా మార్చే విధంగా మేధా వులుగా ఆలోచన చేయాలని గద్దర్ కూతురు వెన్నెల అన్నారు. తమ నాన్నే తనకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకుని తాను సైతం సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నానన్నారు. ఇందులో కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి జహీరొద్దీన్ కుమారుడు ఫకర్ అలీ ఖాన్, టీజీఈజేఏసీ ఛైర్మన్ అశోక్, కోలేట్కర్ పరమేశ్వర్, ఏఎఫ్‌ఏ ప్రెసిడెంట్ అర్ఫత్ ఖాన్, కవి నిమ్మల ప్రశాంత్, అల్లూరి భూమన్న, ఖలీల్ అహ్మద్, సత్యవాన్ చిక్లే, పెంటపర్తి ఊశన్న పాల్గొన్నారు.